క్లుప్తంగా

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, గీసుకొండ, వర్ధన్నపేట, సంగెం, దుగ్గొండి, తదితర మండలాల్లో పద్మశాలి సంఘాలు స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం వేడుకగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ అందించిన సేవలను కొనియాడారు. పలు చోట్ల పండ్లు పంపిణీ చేశారు.

భగత్‌సింగ్..

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను శుక్రవారం భగత్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో భగత్ యువజన సంఘం అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి రమేష్, సురేష్, రమేష్, దేవేందర్‌రావు, కర్ణాకర్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల్లో తనిఖీ



పర్వతగిరి : మండల కేంద్రంలో 108, 102 అంబులెన్స్‌లను జిల్లా ఈఎంఈ రాజ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌ల్లోని రికార్డులను, మందులను, పరికరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కాల్ సెంటర్ నుంచి ఫోన్ వచ్చిన వెంటనే ఘటనా స్థలికి చేరుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపేందర్, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

గ్రూప్-4లో యువతి ప్రతిభ



నర్సంపేట : పట్టణానికి చెందిన మామిడాల శోభ-యాదగిరి దంపతుల కూతురు సాయి సుష్మ గ్రూప్-4 ఫలితాల్లో ప్రతిభ చాటింది. బీటెక్ (సివిల్) పూర్తి చేసిన సాయి సుష్మ గ్రూప్-4 పరీక్ష రాయగా ఓపెన్ కేటగిరిలో ఆమెకు ఏఈఈ ఉద్యోగం లభించింది. ఈ క్రమంలో సాయి సుష్మను హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ నియామక పత్రాన్ని అందించారు. సాయి సుష్మ ములుగు జిల్లా ఏఈఈగా నియమితులయ్యారు.

సైన్స్ మేళాలో 'ఆర్‌డీఎఫ్' విద్యార్థులు..



పర్వతగిరి : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వరంగల్‌లోని ఏవీవీ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన సైన్స్ మేళాలో మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుత పాయ్ విద్యాలయ జూనియర్ కళాశాల ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న కొప్పు శ్రావణ్, సాయి, రాజేశ్ ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. సదరు విద్యార్థులను కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ జనార్దన్ శుక్రవారం అభినందించి మాట్లాడారు. మేళాకు 34 సైన్స్ ఎగ్జిబిషన్స్ రాగా ఆర్‌డీఎఫ్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలవడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు సత్యనారాయణ, జయశంకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా దస్రు



నల్లబెల్లి : పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా ధరావత్ దస్రునాయక్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శోభ నియమితులైనట్లు జిలా శాఖ అధ్యక్షురాలు కొలిపాక సంగీత తెలిపారు. ఈ సందర్భంగా దస్రునాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అధ్యక్ష, కార్యదర్శులను సంఘం ప్రతినిధులు సన్మానించారు.

డీఎల్‌పీఓ విచారణ

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని బస్టాండ్ తన షాపుకు అడ్డుగా ఉందని బార్బర్ షాపు యజమాని యాదగిరి రాములు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన క్రమంలో డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ బస్టాండ్‌ను పరిశీలించారు. షాపుకు అడ్డుగా ఉన్న గోడను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి నూనె వేణుప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీఓ శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.

'మీసేవ'లకు అంతరాయం

- సర్వర్ సమస్యతో ఇబ్బందులు
- పెండింగ్‌లో 2,260 దరఖాస్తులు
- జిల్లాలో 125 కేంద్రాలు

చెన్నారావుపేట: సర్వర్ సమస్యతో కొన్ని రోజులుగా జిల్లాలోని మీ సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. మీ సేవలో 350 రకాలకు పైగా సేవలు అందిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ మీ సేవలు 4, టీజీటీఎస్- 77, టీజీ ఆన్‌లైన్-15, ఓఎస్ఎస్-29 మొత్తం 125 ఉన్నాయి.

మరోసారి ఆన్‌లైన్ చేయాలని మెసేజ్‌లు..

జిల్లా కేంద్రంలోని పలు మీ సేవ కేంద్రాల్లో వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. ఈనెల 8 నుంచి 13 వరకు ఆన్‌లైన్‌లో సమర్పించిన అర్జీలు సర్వర్ సమస్యతో చూపడం లేదని, ఆ సమయంలో సమర్పించిన దరఖాస్తులను మరోసారి ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ కార్యాలయం నుంచి మీ సేవ కేంద్రాలకు సమాచారం వస్తోంది. సర్వర్ డౌన్‌తో మీ దరఖాస్తులు కనిపించడం లేదని, మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని కొందరికి మెసేజ్‌లు వస్తున్నాయి. కానీ, చాలా మందికి మెసేజ్‌లు రావడం లేదు. ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.50 నుంచి రూ.100 మళ్లీ చెల్లించి దరఖాస్తు చేసుకుంటున్నారు.

51 సేవలకు మాత్రమే..

పుట్టిన తేదీ, ఆదాయం తదితర సర్టిఫికెట్లు అత్యవసరమున్న వారికి సమస్యలు తలెత్తుతున్నాయి. 350 రకాల సేవల్లో 51 రకాలకు అంతరాయం కలుగుతోందని అధికారులు తెలిపారు. జిల్లాలో 2,260 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

ధరణి దరఖాస్తులు సైతం..

భూసమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొస్తోంది. ప్రస్తుతం ఆ చట్టానికి సంబంధించి ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో దరఖాస్తులు స్వీకరించడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే, ధరణి దరఖాస్తులు ఒకసారి స్వీకరిస్తున్నారని, మరోసారి స్వీకరించడం లేదని వారు పేర్కొంటున్నారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.



డబ్బులు మళ్లీ చెల్లించొద్దు



సర్వర్ సమస్యతో మీ సేవ కేంద్రాల్లో కొన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ కనిపించడం లేదు. బాధితులు ఏ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారో మళ్లీ అక్కడే దరఖాస్తు చేసుకోవాలి. రెండోసారి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

-పూర్ణచందర్, మీసేవ నిర్వాహకుడు, ముగ్దుంపురం

మూడుసార్లు దరఖాస్తు చేశా..



రెసిడెన్స్ సర్టిఫికెట్ కోసం ఆగస్టు మూడు సార్లు దరఖాస్తు చేశా. సర్వర్ డౌన్‌తో సర్టిఫికెట్ కాలేదని తహసీల్దార్ చెప్పాడు. 40 రోజులు దాటిన తర్వాత మూడోసారి దరఖాస్తు చేస్తే ఈనెల 23న సర్టిఫికెట్ ఇచ్చారు. మొదటిసారి మాత్రమే డబ్బులు చెల్లించాను.

- ఆరె రాజు, చెన్నారావుపేట

పర్యాటక ప్రదేశాలను సందర్శించాలి



మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య, చిత్రంలో కలెక్టర్ సత్య శారద

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

గీసుకొండ: పర్యాటక ప్రదేశాలను సందర్శించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. మండలంలోని గంగదేవిపల్లిలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ఆమె మాట్లాడారు. టూరిజం క్లబ్‌ల ఏర్పాటులో కలెక్టర్ సత్య శారద కృషిని అభినందించారు. దసరా సెలవుల్లో విద్యార్థులు, మహిళలు పర్యాటక ప్రదేశాలను సందర్శించాలని సూచించారు. పలు దేశాలు, రాష్ట్రాల ప్రతినిధులు సందర్శించే విధంగా గంగదేవిపల్లిని తీర్చిదిద్దుకున్న గ్రామస్తులను అభినందించారు. కొత్త ప్రదేశాల్లో సంస్కృతీసంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను తెలుసుకోవాలని కోరారు. జిల్లాలో 41 పర్యాట ప్రదేశాలు ఉన్నాయని వివరించారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ పాకాలలో ఆకుపచ్చ పావురాలను చూడాలన్నారు. ప్రపంచంలో ఇలాంటి పావురాలు ఎక్కడా ఉండవని పేర్కొన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ గంగదేవిపల్లి గ్రామీణ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోందని వివరించారు. పర్యాటకం అంటే విందులు, వినోదాలు కావని, ఆయా ప్రాంతాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుసుకోవడానికి అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, నోట్‌బుక్స్‌ను ఎంపీ, ఎమ్మెల్యే అందజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లను కలెక్టర్ సన్మానించారు. అంతకు ముందు కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులు నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, టూరిజం అధికారి శివాజీ, తహసీల్దార్ రియాజుద్దీన్, మండల స్పెషల్ ఆఫీసర్ సురేశ్, డీఎల్పీఓ వేదవతి, ఎంపీడీఓ కమలాకర్, జిల్లా ట్రెనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ జ్యోతి

నల్లబెల్లి : మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిల్పూరి జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా మండల సమాఖ్యలో అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 15వ వార్షిక మహాసభకు ఆమె అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం మహిళా శక్తి క్యాంటీన్ సర్వీసుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. మహిళ సంఘాల ప్రతినిధులకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లో సముచిత స్థానం కల్పించిందని చెప్పారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు విజయవంతం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. తొలుత ప్రగతి, ఆడిట్ నివేదికలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ నర్సింహామూర్తి, ఏపీఎం సునిత, ఏపీఓ వెంకటనారాయణ, మండల సమాఖ్య కార్యదర్శి అనూష, కోశాధికారి రమాదేవి, సీసీలు పద్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పథకాలను వినియోగించుకోవాలి



నెక్కొండ : మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దయాకర్ కోరారు. మండల కేంద్రంలోని భారతి మండలి సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 16వ వార్షిక మహాసభకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దయాకర్ హాజరై మాట్లాడారు. మహిళా సాధికారత కోసం కేంద్రం ప్రభుత్వం మిషన్ శక్తి పరిధిలోకి తీసుకురానుందని చెప్పారు. ఆర్థిక సంవత్సరంలో మహిళా సమాఖ్య రూ.5,13,884 లాభంలో ఉందని వివరించారు. సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీ రవీందర్, ఏకాంబ్రం, వెంకట్, ఎంఎస్‌ఏ శ్వేత, ఎంఎస్ ఓబీ నాగరాణి, వీఓఏలు ఏకాంబ్రం, అనిత, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక స్థలాల సందర్శనతో విజ్ఞానం

నర్సంపేట : పర్యటక స్థలాలను సందర్శిస్తే విజ్ఞానం పెరుగుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. పట్టణంలోని ఆ కళాశాలలో యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటన దినోత్సవ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి ఉద్యోగ అవకాశాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. యువ టూరిజం క్లబ్ కో ఆర్డినేటర్, కళాశాల వృక్షశాస్త్ర ఆచార్యులు డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ పర్యాటక రంగం, వారసత్వ సంపద సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఆర్గనైజర్ మాధవి, అకాడమిక్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరీ సోమయ్య, పరీక్షల నియంత్రణాధికారి కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ టెక్నో స్కూల్‌లో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారు బాలాజీ టెక్నో స్కూల్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. పర్యటనలు చేయడం వల్ల వివిధ ప్రాంతాల ప్రజల జీవిత విధానం, ఆచార వ్యవహారాలు తెలుసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు చార్టులను,నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజొద్దీన్, రాజేశ్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయంలో నిబంధనలు తప్పనిసరి



షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ నర్సింగం, ఏఓ

గీసుకొండ : ఎరువులు, పురుగు మందుల విక్రయంలో డీలర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వర్ధన్నపేట ఏడీఏ నర్సింగం స్పష్టం చేశారు. మండలంలోని పలు ఎరువుల, పురుగు మందుల దుకాణాలను ఏఓ హరిప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీకి మించిన ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఎరువుల విక్రయం సందర్భంగా ఈ-పాస్ మిషన్లను వినియోగించాలని చెప్పారు. రైతులు అవసరానికి మించి యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఉపయోగించవద్దని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన నానో యూరియా, డీఏపీలను వినియోగించాలని తెలిపారు. అనంతరం ఊకల్ సొసైటీ మేనేజర్ రామకృష్ణ, చైర్మన్ రమేశ్‌లతో రుణమాఫీలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. తదనంతరం కోనాయమాకుల రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్షించారు. పంటల నమోదు, రుణమాఫీ, రైతుబీమాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమాల్లో ఏఈవోలు రజని, కావ్య, అఖిల, స్మిత, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాలకు చెక్

నర్సంపేట రూరల్ : అవగాహన పెంచుకోవడం ద్వారా అగ్ని ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చని ఫైర్ ఆఫీసర్ రాజేంద్రం తెలిపారు. శివాని పబ్లిక్ స్కూల్ శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సుబ్బారావు, డైరెక్టర్ రాహుల్ వర్మ, స్వాతి దేవేందర్, కిరణ్, రామకృష్ణ, ప్రిన్సిపాల్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచాలి

వర్ధన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సృజన్ తేజ కోరారు. పట్టణ పరిధిలోని గుబ్బెడి తండా, డీసీ తండా, నీలగిరిస్వామి తండాలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ శ్రీధర్‌తో కలిసి శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్య సామర్థ్యలను పరిశీలించారు. అనంతరం సృజన్ తేజ మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఎఫ్ఎల్ఎన్ ద్వారా బోధించాలని చెప్పారు.

రాయపర్తి : మండలంలోని పానిష్‌తండా, గట్టికల్, కొత్తతండా, జగన్నాథపల్లి కొత్తతండా పాఠశాలలను డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంతోపాటు విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని సూచించారు. విద్యాభివృద్ధి కోసం కృషి చేయవలసిన అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాక పద్మావతి, రాజ్‌కుమార్, సీఆర్‌పీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న సృజన్ తేజ

ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలి



నల్లబెల్లి : ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రోజువారి ఫిర్యాదుల రికార్డు, జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ఎఫ్ఐఆర్, తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్సై ప్రశాంత్, సిబ్బందితో మాట్లాడారు. వృత్తి పట్ల నిబద్ధత కలిగి ఉండాలని చెప్పారు. నేరాల నియంత్రణ కోసం తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట రూరల్ సీఐ సాయిరమణ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

రాయపర్తి : రాష్ట్ర ప్రభుత్వం, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తూరులో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా అభివృద్ధి పనులు చేపట్టడానికి ఎమ్మెల్యే చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కందికట్ల యాకయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓను సస్పెండ్ చేయాలి

నర్సంపేట : డిప్యూటీ డీఎంహెచ్‌ఓను సస్పెండ్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం కలెక్టరేట్ పరిపాలన అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం శ్రీధర్ మాట్లాడారు. నర్సంపేటలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు రోగులను అవసరం లేకున్నా స్కానింగ్, మందులు, తదితరాల పేరుతో యథేచ్ఛగా దోచుకుంటున్నా డిప్యూటీ డీఎంహెచ్ఓ చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ తీరుపై విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కమిటీ సభ్యుడు గడ్డమీది బాలకృష్ణ, నాయకులు దాసరి నరేశ్, జగన్నాథం, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని..

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంతోపాటు గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు శుక్రవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రమేశ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్నా విద్యాశాఖకు మంత్రిని నియమించలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఆ సంఘం డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, నాయకులు సాయికుమార్, వరుణ్, అజయ్, రాకేశ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతిపై విచారణ చేపట్టాలి

వర్ధన్నపేట : స్థానిక మున్సిపాల్టీలో జరిగిన రూ.6 కోట్ల అవినీతిపై విచారణ చేపట్టాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేసింది. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. రెండేళ్ల క్రితం నిధులు కాజేశారన్నారు. కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

మహిళలకు చీరల పంపిణీ

రాయపర్తి : ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు మండలంలోని మైలారంలో 700 మంది మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల మధూకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి మాట్లాడారు. ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి చొరవతో చీరెలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సంది దేవేందర్‌రెడ్డి, సంపత్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నర్సంపేట : ఈనెల 28న వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో నిర్వహించనున్న ఎంసీపీఐ(యూ) యువజన సంఘం రాష్ట్రస్థాయి ప్లీనరీకి సంబంధించిన కరపత్రాలను పట్టణంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు కొత్తకొండ రాజమౌళి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడారు. యువజన సంక్షేమాన్ని పాలకవర్గాలు విస్మరించాయని విమర్శించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని చెప్పారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని ప్లీనరీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జన్ను రమేష్, మార్త నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



గీసుకొండ : మండలంలోని కొమ్మాల వద్ద తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్తున్న సమయంలో మాడిశెట్టి రఘు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు శుక్రవారం అప్పగించారు.

సంక్షిప్త సమాచారం

ఈ సందర్భంగా సీఐ బాబూలాల్ వివరాలు వెల్లడించారు. రఘు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించి ఆచూకీ తెలుసుకున్నట్లు తెలిపారు.

ఏబీవీపీ పట్టణ కార్యదర్శిగా జీవన్

వర్ధన్నపేట : ఏబీవీపీ వర్ధన్నపేట పట్టణ కార్యదర్శిగా జీవన్ ఎన్నికయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ నాయకుడు హర్షవర్ధన్ సమక్షంలో కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లం కార్తీక్, వరంగల్ నగర కార్యదర్శి గోరుకంటి శివమణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

చెన్నారావుపేట : క్రీడలతో శారీరక, మానసిక వికాసానికి బాటలు పడతాయని ఎంఈఓ, ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వాహణ కమిటీ అధ్యక్షురాలు సరళ తెలిపారు. మండలంలోని జల్లి గ్రామంలోని హైస్కూల్‌లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట, నెక్కొండ మండలాల విద్యార్థులకు చేపట్టిన అండర్-14, అండర్-17 కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ ఎంపిక పోటీలను ఎస్సై రాజేష్‌రెడ్డితో కలిసి సరళ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడాపోటీలను స్నేహాభావంతో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ జెడ్పీ స్కూల్‌లో..

గీసుకొండ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ లోని మైదానంలో గీసుకొండ, సంగెం మండలాల జోనల్ స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. పోటీలు శనివారం ముగియనున్నాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి పాక శ్రీనివాసరావు, హెచ్‌ఎం పట్టాభి, పీఈటీలు, పీడీలు శ్రీనివాస్, రవీందర్, శ్రీధర్, హేమలత, రతన్‌సింగ్ ముఖర్జీ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు'

పర్వతగిరి : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాదిగ సామాజిక వర్గాన్ని కించపర్చేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మాలల ఓట్లు ఆరు వేల కాగా మాదిగ కులస్తుల ఓట్లు 65 వేలకుపైగా ఉన్నా మాదిగల ఓట్లు చీలిపోగా మాల కులస్తుల ఓట్లతోనే గెలిచినట్టి ఎమ్మెల్యే మాట్లాడడం దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలిచే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకుడు దుబ్బర సురేందర్ పాల్గొన్నారు.

మంచినీళ్ల చెరువు పరిరక్షణకు ముందుకురావాలి

రాయపర్తి : మండల కేంద్రంలోని మంచినీళ్ల చెరువు పరిరక్షణకు గ్రామస్తులందరూ ముందుకు రావాలని పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. చెరువు సమీపంలోని సత్యనారాయణ ఫౌల్ట్రీ హ్యాచరీస్ నుంచి వచ్చే వ్యర్థాలతో నీరు కలుషితం అవుతున్న క్రమంలో గ్రామస్తులు ఆందోళనలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కమిటీ సభ్యులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది సహాయంతో పంచాయతీ కార్యదర్శి వల్లె వినోద్‌కుమార్ శుక్రవారం కేసింగ్ పైపు అమర్చే పనులు చేయించారు. స్వచ్ఛమైన నీటిని అందించే పనులు చేపట్టారు.

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

పర్వతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో అసంబద్ధ టీచర్ల ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఐదు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తారని ప్రశ్నించారు. 8 సంవత్సరాల క్రితం రూపొందించిన నిబంధనలనే ఇప్పటికీ అమలు చేయాలని చూడడం సరికాదన్నారు. పూర్వ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి యు.అశోక్, జిల్లా నాయకులు పి.సురేశ్‌బాబు, పర్వతగిరి మండల కన్వీనర్ పిండి మల్లికార్జున్, మండల నాయకులు దొరం రమేశ్, రాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలి

నల్లబెల్లి : పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు స్వచ్ఛందంగా మానుకోవాలని తహసీల్దార్ కృష్ణ కోరారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండాయిల్‌పల్లిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. గ్రామంలో సేకరించిన ప్లాస్టిక్ బాటిళ్లతో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కార్యదర్శి రజిత ఆర్చి ఏర్పాటు చేసి అందరినీ ఆలోచింపజేశారు. స్వచ్ఛ కొండాయిల్‌పల్లి నిర్మాణం కోసం 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా సంతకాలు సేకరించారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

ముందస్తు జాగ్రత్తలతో పశువుల రక్షణ

సంగెం : ముందస్తు టీకాల ద్వారా పెంపుడు జంతువులను వ్యాధుల నుంచి రక్షించొచ్చని మండల పశు వైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెంపుడు జంతువులకు ముందస్తు జాగ్రత్తగా యాంటీ రేబీస్ టీకా వేయించాలని సూచించారు. నేడు ఉదయం 10 గంటలకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపకులు బుచ్చిరెడ్డి, కుమారస్వామి, యాక సాయిలు, నాగరాజు, అనిల్ కుమార్, రాఖీ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వర్ధన్నపేట : పట్టణ పరిధిలోని నీలగిరిస్వామి తండాకు చెందిన సుమన్ శుక్రవారం తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పట్టణంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమన్‌కు వెనుక నుంచి వస్తున్న కారు కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోగా స్థానికులు సమాచారం అందించడంతో సుమన్‌ను 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

సన్మానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ)గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాజీవ్ కుమార్‌ను నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ శుక్రవారం శాలువా కప్పి సన్మానించారు. తొలుత డీఎల్‌పీఓను చైర్మన్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓలు రామ్మోహన్, సునీల్‌కుమార్ రాజ్, కత్తి కిరణ్, గజ్జి రాజు మర్యాద పూర్వకంగా కలిసి పూల బోకే అందించారు. అభినందనలు తెలిపారు.

ఎంఈఓ సరళకు..

చెన్నారావుపేట : ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో ఎంఈఓ సరళను ఉపాధ్యాయులు, సిబ్బంది శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులను ఉత్తములుగా తయారు చేయడంలో ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపమ్మ, ఉపాధ్యాయులు జయ, ప్రభాకర్‌రావు, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ ధర్మారంలోని జెడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు పూర్వవిద్యార్థి వనం బాలరాజు ఆర్థికసాయంతో శుక్రవారం టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్‌కుమార్, అమ్మ కమిటీ అధ్యక్షురాలు శిరీష, అల్యూమినీ కమిటీ అధ్యక్షుడు మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వ్యాఖ్యల వక్రీకరణ సిగ్గుచేటు'

వర్ధన్నపేట : ఎమ్మెల్యే నాగరాజు వ్యాఖ్యలను ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు వక్రీకరించడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, సీనియర్ నాయకుడు మన్నె బాబురావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాల కులస్తులు 6 వేలు, మాదిగలు 60 వేలు ఉంటే గతంలో మంద కృష్ణ ఎందుకు గెలుపొందలేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు చీటూరి రాజు, ఐత ప్రవీణ్, తుమ్మల రవీందర్, కొండేటి మధు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.